www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 27-9-2025 | పేజీలు: 8 + 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 163 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.12.04 తదుపరి షష్ఠి, నక్షత్రం: అనూరాధ రా.1.08, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6.08-7.43, అమృతఘడియలు: మ.1.26-3.14, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.03 | రంగారెడ్డి*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పోరాట యోధురాలు

చాకలి ఐలమ్మ

» జిల్లా రెవెన్యూ అధికారి సంగీత



కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంగీత

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వెనుబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం పాలన సమయంలో విస్నూర్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. ఆమె తెగువతో రజాకార్ల గుండెల్లో భయం పుట్టించిందన్నారు. కార్యక్రమంలో ఏవో సునీల్, బీసీ వెల్ఫేర్ అధికారి కేషరామ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, జీఎం ఇండస్ట్రీస్, ఫిషరీస్, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. మహిళా ఉద్యోగులు స్వయంగా బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీలత, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

» మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు

కందుకూరు,సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర పరిశ్ర మలు, ఐటీ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. కందుకూరు మండల కేంద్రంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా మూడో మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వృత్తిదారులు కావడంలో వారి సమస్యలను పరిష్కారం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. సమాజంలో కోట్ల మందిని కదిలించే చైతన్య రథం జర్నలిజం, సమాజానికి దారి చూపే దిక్సూచి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు, విద్యార్థుల ఫీజు రాయితీలు, ఆరోగ్యభద్రత వంటి అంశాలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీం కోర్టు తీర్పుతో ఏర్పడిన సందిగ్ధతపై న్యాయ నిపుణులతో సమాలోచనలు జరుగుతున్నాయన్నారు. జర్నలిస్టులకు న్యాయం చేసే మార్గంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. కలం శక్తి ముందు ఎవరు నిలువలేరని కలం వల్ల ఎన్నో ప్రభుత్వాలు కూలిపోగా, కొత్త ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన ఉదాహరణలు చరిత్రలో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యులు దేపభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ కృష్ణానాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాంచందర్, నాయకులు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, సురేందర్‌రెడ్డి, జయేందర్‌ముదిరాజ్, చిలుకమర్రి నర్సింహ, టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, సోమయ్య, బసవపున్నయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సైదులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు కుండపోతగా వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. జిల్లాను కలుపుకుని ఉన్న ఈసీ, మూసీ వాగులు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి.నగర శివారులో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. పంట పొలాల్లో వరదనీరు చేరింది. షాబాద్ మండలం, తాళ్లపల్లిలో 105.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. షాబాద్‌లో 102.3 మి.మీ., చందన్‌వెల్లిలో 86.8 మి.మీ., మొగిలిగిద్దలో 79.5 మి.మీ., కొందుర్గులో 76.0 మి.మీ., కాసులాబాద్‌లో 67.8 మి.మీ., శంషాబాద్ పెద్ద షాపూర్‌లో 56.0మి.మీ., కందాడలో 52.0 మి.మీ. వర్షం కురిసింది.



శంకర్‌పల్లిలో ఉధృతంగా పారుతున్న మూసీ వాగు

రోజంతా వాన!

జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం



శంకర్‌పల్లి మండలం రాంమంతపూర్ గ్రామంలో గులాబీ తోటలో నిలిచిన వర్షం నీరు

- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ, మూసీ వాగులు
- పంటపొలాల్లో నిలిచిన వరద నీరు
- పలుమార్గాల్లో నిలిచిన రాకపోకలు
- ఇబ్బంది పడిన ప్రజలు, వాహనదారులు

చేవెళ్ల /షాబాద్/శంకర్‌పల్లి /మొయినాబాద్ రూరల్/ కొందుర్గు /కందుకూరు /చౌదరిగూడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల డివిజన్‌లో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లో ఆగకుండా వానపడటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. జోరువానకు ఈసీ, మూసీ వాగులు నిండుగా ప్రవహించాయి. అయితే చేవెళ్ల మండలంలోని పామెన, ఆలూర్, దేవునిఎర్రవల్లి గ్రామాలలోని వాగులు నిండుగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పంటపొలాల్లో వర్షం నీరు చేరింది. వర్షం కారణంగా షాబాద్ మండల కేంద్రానికి చెందిన కొందుటి వెంకటయ్య ఇళ్లు కూలింది. షాబాద్ పైల్వాన్ చెరువు అలుగు పారింది. శంకర్‌పల్లి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో

మిగతా 4వ పేజీలో...

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుర్రంపల్లి వాగును పరిశీలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు ఎవరూ దాటేందుకు ప్రయత్నించొద్దని సూచించారు. వర్షాలు, వాగులు వంకల సమాచారం వాట్సాప్ గ్రూపుల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వాగుల వద్ద రెవెన్యూ, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై విజయ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతి



సత్తయ్య (ఫైల్)

చౌదరిగూడ : వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఎంకేపల్లి సత్తయ్య(54) తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఇంద్రానగర్ శివారులో ఉధృతంగా పారుతున్న వాగును దాటేందుకు ఆయన ప్రయత్నిస్తుండగా కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు వాగు వెంట వెతకడంతో కొద్దిదూరంలో చెట్ల పొదలకు తట్టుకున్న సత్తయ్య మృతదేహం కనిపించింది. వెంటనే వాగులోంచి తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాచారం.

ఇందిరమ్మ మోడల్ హౌజ్

నిర్మాణం పూర్తి

ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రారంభానికి సిద్ధం



ఇందిరమ్మ మోడల్ హౌజ్

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం మండలానికి ఒకటి మోడల్ హౌజ్‌ను మంజూరు చేసింది. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.5లక్షలతో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను నిర్మించారు. ఎంపీడీవో మాధురి పర్యవేక్షణలో నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఇళ్ల నిర్మాణం చేసుకునేలా ఈ మోడల్ హౌజ్‌ను నిర్మించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

ఆదిభట్లకు నేడు ఎమ్మెల్యే

ఆదిభట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీలో నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నట్లు కమిషనర్ బాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కామండ్ల యాదగిరి కూడా హాజరుకానున్నట్లు తెలిపారు వివిధ వార్డులలో రూ. 6.85 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించి, మరో 3.08 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

» డీఆర్‌డీవో పీడీ శ్రీలత

» ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

కేశంపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత హెచ్చరించారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూలీల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కేశంపేట మండలంలో రూ.2.33కోట్ల పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. కానీ చేపట్టిన ఉపాధి పనుల్లో కొంత మార్పులు జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైందని వివరించారు. రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు కాకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. ఇలాంటివి ఏమైనా ఉంటే పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తన దృష్టికి తేవాలన్నారు. లేదంటే వారిని బాధ్యులుగా భావించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పనుల్లో తప్పక నాణ్యత పాటించాలన్నారు. పనులను పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అధికారి సుభాషిణి, అంబుడ్స్‌మెన్ ఏపీడీ శరణ్ గౌతమ్, కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఏపీవో అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం అద్భుతం

- మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం రాజేంద్ర శుక్ల
- కుటుంబ సభ్యులతో కలిసి సందర్శన
- ఆశీస్సులు అందించిన చిన జీయర్‌స్వామి

3

రైతులు తిరగబడితే పతనమే..

» పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న కాంగ్రెస్

» మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

3

'సమావేశాన్ని వాయిదా వేయండి'

కందుకూరు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయాలంటూ శుక్రవారం 11 మంది డైరక్టర్లు సీఈవో నిమ్మ యాదగిరిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 639/2025 జీవో ప్రకారం సాయిరెడ్డిగూడ డైరక్టర్ వెంకట్‌రాంరెడ్డిని చైర్మన్‌గా నియమించింది. ఆ నియామకం చెల్లదంటూ 11మంది డైరక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో గతంలో చైర్మన్‌గా ఉన్న డి.చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టాలని కోర్టు స్టే ఇచ్చింది. కాగా ఈనెల 29న సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇటీవల చైర్మన్‌గా ఎన్నికైన ఎస్.వెంకట్‌రాంరెడ్డి సంబంధిత డైరక్టర్లకు ఎజెండా పంపించినట్లు డైరక్టర్లు గోపిరెడ్డి విజయేందర్‌రెడ్డి, పొట్టి ఆనంద్, సురసాని శేఖర్‌రెడ్డి తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు చైర్మన్ ఎవరు అనేది తేలిన తర్వాతనే సమావేశాన్ని నిర్వహించాలని డైరక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో డైరక్టర్లు పర్వతాలు, నర్సింహ్మా, చంద్రునాయక్, అంజమ్మ, వెంకటేష్, యశోద పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సామూహిక కుంకుమార్చన కార్యక్రమం సంప్రదాయాన్ని చాటింది. ఆమనగల్లు కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బికుమాండ్ల నర్సింహ్మ, పాండయ్య, డాక్టర్ శ్రీనివాస్, చంద్రశేఖర్, కృష్ణయ్య, లక్ష్మయ్య, కొరివి వెంకటయ్య, బికుమాండ్ల రమేశ్, జగదీశ్, చంద్రశేఖర్, విష్ణువర్ధన్, కండె సుమన్, లింగయ్య ఉన్నారు.



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

జయలక్ష్మి అవతారంలో..



శంషాబాద్ మండలంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో 5వరోజు శుక్రవారం అమ్మవారు జయలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అష్టోత్తర నామ అర్చన, కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి)



పిండివంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఆకట్టుకున్న పిండి వంటలు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా స్వయం, సహాయక సంఘాలు తయారు చేసిన పిండివంటల ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) శ్రీనివాస్ సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పిండి వంటలను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ మెప్మా వెంకటనారాయణ, మెప్మా ఏవో జైత్‌రాం, డీఎంసీ ఇందిరా, సిబ్బంది అశోక్, కృష్ణ, చైతన్య పాల్గొన్నారు.

బీజేపీ నేతల స్వచ్ఛ భారత్



పీహెచ్‌సీలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న నాయకులు

శామీర్‌పేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని మూడుచింతలపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ హాజరై ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం మూడుచింతలపల్లి ప్రధాన చౌరస్తాలో వీరనారీ చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌నాయక్, నాయకులు రవీందర్, జాం సుధాకర్, శ్రీశైలం, శ్రీకాంత్‌రెడ్డి, దొండ మహేష్, పరమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌టీసీలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్



సీడీ ఆవిష్కరిస్తున్న గోపాల్‌రెడ్డి, తదితరులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపల్ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో శుక్రవారం సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ 8వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి యూఎస్ఏ, యూకె, జర్మనీ, మలేషియా, ఇరాన్ వంటి దేశాల నుంచి 900 పేపర్స్ సబ్‌మిట్ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈవో అభినవ్‌రెడ్డి, సెక్రటరీ వసంతలత, ప్రిన్సిపాల్ ఏ.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కేఐఐటీ డైరెక్టర్ సురేష్‌చంద్ర సతపతి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల కన్వీనర్ కె.సృజనరాజు, వి.నరేష్‌కుమార్, అశుతోష్ సక్సెనా, ధర్మాజీరావు, ఎస్.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వాగు వద్ద పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును, వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదని సూచించారు. శిథిలావస్థలో ఉన్న వంతెనలపై, వరద ప్రవాహం ఉన్న రోడ్లపై వెళ్లొద్దని కోరారు. అకాల వర్షాల వల్ల దాదాపు అన్ని రకాల పంటలు పాడైపోయాయని, ప్రభుత్వం నష్టపోయిన పంట రైతులకు సత్వరమే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభం

చేవెళ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్లలో డాక్టర్ రవీందర్‌గౌడ్ ఏర్పాటు చేసిన ఎస్ఎం ఫిజియోథెరపీ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి, డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎన్ను జంగారెడ్డి, ప్రభాకర్, నాయకులు లక్షణ్‌గౌడ్, సాయికిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సంపద

» జూనియల్ సివిల్ జడ్జి కాటం స్వరూప



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి స్వరూప

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞాన సంపద పెరుగుతుందని ఆమనగల్లు జూనియల్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది శశికాంత్ మదుపు సహకారంతో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాయాలన్ని శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్, న్యాయవాదులతో కలిసి ప్రారంభించారు. గ్రంథాలయం ఏర్పాటుకు పుస్తకాలు, ఫర్నిచర్, కంప్యూటర్, ప్రింటర్ సమకూర్చిన శశికాంత్‌ను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచి ఆలోచనలు రావాలంటే పుస్తక పఠనం చేయాలని సూచించారు. గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు దాతలు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు అంజనేయులు, ఉపాధ్యక్షుడు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్‌గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేశ్, న్యాయవాదులు జమీల్ అహ్మద్, లక్ష్మణ రాజు, మల్లేశ్, మధుగౌడ్, గణేశ్‌గౌడ్, మహేశ్, శివకుమార్, శ్రీనివాస్, బీక్యానాయక్, సర్దార్ నాయక్, శ్రీశైలం, మురళీకృష్ణ, సూపరింటెండెంట్ మురళీధర్, వర్ధన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఏటీసీ

» నేడు తాండూరులో ప్రారంభించనున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

» అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో శిక్షణ, ఉద్యోగాలు

» 172 సీట్లకు గాను పూర్తిగా భర్తీ



తాండూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతలో శిక్షణ నైపుణ్యాలు పెంపొందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ) మంజూరు చేయగా అందులో తాండూరు కూడా సెంటర్ కూడా ఒకటి. ఒక్కో ఏటీసీ నిర్మాణానికి రూ.60 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో 80 శాతం నిధులు టాటా టెక్నాలజీ లిమిటెడ్(టీటీఎల్) సమకూర్చగా ఏటీసీల నిర్మాణం, విద్యుదీకరణ తదితర పనుల నిర్మాణానికి 15 శాతం నిధులను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇప్పటికే తరగతులను ప్రారంభించారు. తాండూరు ఏటీసీలో 172 సీట్లకు పూర్తిగా భర్తీ అయ్యాయి. జిల్లాలో తాండూరుతోపాటు వికారాబాద్, మర్పల్లి, కేంద్రాలకు కూడా ఏటీసీ సెంటర్లు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 50 కేంద్రాల్లో ఈ సెంటర్లను ప్రారంభించనున్నారు. తాండూరు ఏటీసీ సెంటర్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

మల్టీనేషనల్ కంపెనీలతో ఒప్పందం

ఏటీసీలో సంవత్సరం, రెండేళ్ల కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టాటా, టాటా నెల్కోటెక్, ఎక్స్‌పర్ట్, డెల్, ఇన్ఫోసిస్ తదితర నేషనల్, మల్టీ నేషనల్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మరి కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. తెలంగాణ గేట్‌వే అడాప్ట్ ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ వివిధ పారిశ్రామికవేత్తలతో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించే విషయమై చర్చలు జరుపుతున్నారు. పరిశ్రమలు అవసరాలకు అనుగుణంగా ఏటీసీలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా టీగేట్ చర్యలు తీసుకుంటున్నది.

కోర్సుల వివరాలు

మానుఫ్యాక్షరింగ్, ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటెక్స్ డిజిటల్, మానుఫ్యాక్షరింగ్ టెక్నీషియన్, ఆర్టీసియన్ యుజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్స్ కోర్సులు ఉన్నాయి.

రైతులు తిరగబడితే పతనమే..

» పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న కాంగ్రెస్

» మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు తిరుగుబాటు చేస్తే ప్రభుత్వ పతనం తప్పదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గుర్కా జైపాల్‌యాదవ్ హెచ్చరించారు. ఆమనగల్లులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చి చిన్న, సన్న కారు రైతులను వేదనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలు, రైతుల అభిప్రాయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. రైతులు తిరగబడక ముందే, సచివాలయం ముట్టడించక ముందే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు వీడి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, సయ్యద్ ఖలీల్, సైదులుగౌడ్, చుక్క నిరంజన్ గౌడ్, గండికోట శంకర్, భాస్కర్, మహేశ్, వెంకటేశ్, నిరంజన్ పాల్గొన్నారు.



మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎంను ఆశీర్వదిస్తున్న చిన జీయర్‌స్వామి

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం అద్భుతం

» మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం రాజేంద్ర శుక్ల

శంషాబాద్‌రూరల్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ముచ్చింతల్‌లో ఉన్న సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని శుక్రవారం మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం రాజేంద్ర శుక్ల కుటుంబ సభ్యులు సందర్శించారు. అంతకు ముందు వేద పండితులు డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వర్ణ విగ్రహం, 108 దివ్య దేశాలు, శ్రీశ్రీశ్రీ సమతామూర్తి స్వామి (పెద్ద జీయర్‌స్వామి) ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన జీయర్‌స్వామి ఆలయ విశేషాలు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం మహా అద్భుతంగా నిర్మించారన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను, ధర్మాన్ని కాపాడడంలో చిన జీయర్‌స్వామి ముందుంటారన్నారు. అనంతరం చిన జీయర్‌స్వామి డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులకు మంగళశాసనములు, తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద జీయర్‌స్వామి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



చిన్నారులతో ముచ్చటిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా భరోసానిచ్చారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మరాశిపేటలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రాన్ని, శామీర్‌పేటలోని మూడో కేంద్రాన్ని ఆమె జిల్లా సంక్షేమాధికారి, ఐసీడీఎస్ సీడీపీవో నాగశారదతో కలిసి సందర్శించారు. శామీర్‌పేట మూడో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె అక్కడ కనీస వసతులు లేక టీచరు, సిబ్బంది, చిన్నారులు పడుతున్న అవస్థలను, చూసి చలించిపోయారు. ఈ విషయాన్ని ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని సిబ్బంది వాపోయారు. స్పందించిన అదనపు కలెక్టర్ యుద్ధ ప్రాతిపదికన సదుపాయాలను కల్పించాలని తూంకుంట మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. బొమ్మరాశిపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి కూడా అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయిస్తానని భరోసా ఇచ్చారు. అంతకు ముందు కేంద్రాల్లోని చిన్నారులతో కలిసి కూర్చొని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఆటపాటలతో సంతోషంగా కాసేపు ముచ్చటించారు. ఇటీవల ప్రారంభించిన గోడల పేయింటింగ్ పనులను పరిశీలించారు. సీడీపీవో శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్ వాడీ టీచర్లు ఉన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

చేవెళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరలు గోవింద నామ స్మరణంతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు వేంకటేశ్వర స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని కోలాటాం ఆడి ఆకట్టుకున్నారు. స్వామి వారి బ్రహోత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, అర్చకులు అనంతం, వాసు, శ్రీపాదు, కన్నా, వైభవ్, భక్తులు, ఆయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సింహ వాహనంపై స్వామివారు

పట్టుదలతో చదివి.. విజేతలుగా నిలిచి

గ్రూప్ -1 ఉద్యోగులుగా సెలక్ట్ అయిన ఉమ్మడి జిల్లావాసులు

మహేశ్వరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 1 ఫలితాల్లో 269వ ర్యాంక్ సాధించిన తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ గ్రామానికి చెందిన గణపతి అసిస్టెంట్ ఆడిటర్ అధికారి(ఏఏవో)గా ఉద్యోగం సాధించాడు. గణపతి చిన్నప్పటి నుంచి కృషి పట్టుదలతో చదివి మంచి ఉద్యోగం సాధించడంతో మంఖాల్ గ్రామస్తులు గణపతిని అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు.



గణపతి(ఏఏవో)



క్రాంతికుమార్

ఎంపీడీవోగా క్రాంతికుమార్

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి చెందిన న్యాయవాది గోపాల్ కుమారుడు క్రాంతికుమార్ గ్రూప్ వన్ ఫలితాల్లో సత్తా చాటాడు. గ్రూప్ వన్‌లో ఉద్యోగం సాధించడంతో ఎంపీడీవోగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రాంతికుమార్‌ను బొంరాస్‌పేట్ మండల ప్రజలు, తోటి స్నేహితులు అభినందించారు.

డీఎస్పీగా ఓంకార్‌యాదవ్



ధారూరు, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): నాగసమందర్ వాసి గ్రూప్ - 1 ఉద్యోగం సాధించారు. మండలంలోని నాగసమందర్ గ్రామానికి చెందిన మామిళ్ల శంకరప్ప, యాశోద దంపతుల కుమారుడు మామిళ్ల ఓంకార్ యాదవ్ ఇంటర్ తర్వాత జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ కోసం ఐఐటీ రామయ్య ఇన్‌స్టిట్యూట్‌లో కోర్స్ చేశారు. నేతాజీ సుభాష్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆల్‌ఓవర్ ఇండియా టాప్ కాలేజీలో సీఎస్‌సీ పూర్తి చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని గురుగావ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేశారు. మూడేళ్ల క్రితం ఉద్యోగం వదిలి వేసి గ్రూప్-1కు సిద్ధమయ్యాడు. మంచి ర్యాంకు సాధించి డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. మండలంలో నాగారం, నాగసమందర్ గ్రామాల నుంచి ఇద్దరు డీఎస్పీలుగా ఎంపికకావటంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

ప్రజాపాలనతో ప్రతీ ఒక్కరికి మేలు

» నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనతో ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కడ్తాల మండలం పల్లెక తండాలో టీజీఐబీసీ నిధుల నుంచి రూ.కోటి తో నిర్మించే అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం రాత్రి 12 గంటలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు పాలకుర్ల అద్దాల రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయక్, నాయకులు పాలకుర్ల మహేందర్, శ్రీను నాయక్, దీప్లనాయక్, నర్సింహనాయక్, సీతారామ్‌నాయక్, మోతీలాల్, నరేందర్, సీతారామ్, పాండు, బద్రు, గౌని లక్ష్మయ్య, భీష్మాచారి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

» పాలకవర్గం రాజీనామా చేయాలి: రైతులు



మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన 45వ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ సక్రమంగా జరగలేదని ఆరోపించారు. ఘట్‌కేసర్ రైతులకు దాదాపు రూ.9 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉందన్నారు. దీనిపై అవసరమైతే ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. అయితే రైతు రుణమాఫీ జరుగకపోవడానికి సహకార సంఘం అధికారులు, పాలకవర్గం తప్పిదాలే కారణమని పలువురు రైతులు, ఆయా పార్టీల నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం రాష్ట్రమంతా రుణమాఫీ చేసి రెండేళ్లు కావస్తున్నా ఇక్కడి రైతులకు మాత్రం రుణమాఫీ జరగలేదని వాపోయారు. తక్షణమే పాలకవర్గం రాజీనామా చేయాలని రుణమాఫీ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొద్ది సేపు గందరగోళ పరిస్థితి నెలకొన్నది. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ ఎంపీపీలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎండీ రహల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు



ధావుడేకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దశరథం

తలకొండపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ సేవా దల్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు అక్టోబరు 13 నుంచి 18 వరకు హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు సేవా దల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగుల దశరథం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి రావాలని శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌తో కలిసి ఏఐసీసీ జాతీయ కార్యదర్శి ధావుడేకు ఆహ్వాన పత్రికను అందజేసినట్లు దశరథం తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అలైన్‌మెంట్‌ను మార్చి న్యాయం చేయాలి

కడ్తాల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అలైన్‌మెంట్‌ను మార్చి రైతులకు న్యాయం చేయాలని మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 19వ రోజుకు చేరాయి. దీక్షలో గానుగుమర్ల తండాకు చెందిన పాండునాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, లక్ష్మనాయక్ కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్ మార్చి పంట పొలాల మీదుగా చేపట్టడం సరికాదన్నారు. దీక్షలో కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, వెంకట్రాములు గౌడ్, రాములు, రాజేందర్ యాదవ్, నర్సింగ్ రాజు, దేవ్, లక్ష్మణ్, గోరటి కృష్ణ ఉన్నారు.

దసరా వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని దసరా ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దసరా ఏర్పాట్లపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎసై వెంకటేశ్, కమిటీ సభ్యులు దుర్గయ్య, అప్పం శ్రీను, గోరటి నర్సింహ, శ్రీకాంత్ సింగ్, కాలే మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

దీవించమ్మా.. దుర్గమ్మ

దసరా శరన్నవరాత్రోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తులు మండపాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కాగా, శుక్రవారం అమ్మవారు ఐదో రోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గాదేవిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


మహేశ్వరం : మహాలక్ష్మి దేవిగా అమ్మవారు


కేశంపేట : సంతాపూర్‌లో గ్రామస్తులు..


కొత్తూర్ : శ్రీదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో కుంకుమార్చన


కందుకూరు : దాసర్లపల్లిలో శతచండీయాగం నిర్వహిస్తున్న భక్తులు


ఆమనగల్లు : కన్యకా పరమేశ్వరాలయంలో హోమం


మంచాల : ఆరుట్లలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కుంకుమార్చనలో మహిళలు


ఇబ్రహీంపట్నం టౌన్‌లో మహాలక్ష్మీ దేవి అలంకారంలో దుర్గాదేవి


కడ్తాల : పూజల్లో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్


శంషాబాద్ : గగన్ పహాడ్‌లోని సత్యం శివం సుందరం గోశాలలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


చేవెళ్ల : రచ్చబండ మండపం వద్ద అన్నదానం చేసిన దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

- షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలె యాదయ్య
- ఘనంగా ఐలమ్మ జయంత్యుత్సవం
- విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి

కేశంపేట, షాద్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం కేశంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం, రెడ్డి దొరలకు వ్యతిరేకంగా పోరాటంచేసి తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశం, రజకసంఘం అధ్యక్షులు రాములు, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, తదితరులున్నారు.

చేవెళ్ల : యావత్ మహిళా లోకానికి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల రజక సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ఐలమ్మ జయంతి సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ నాయకులతోపాటు ఇతర సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే హాజరై నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్, యాదయ్య, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, శ్రీనివాస్‌గుప్తా, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, పాండు, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, శ్రీనివాస్, మాణిక్యరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు సమతారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు రామస్వామి, ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, రజక సంఘం మండలాధ్యక్షుడు శివకుమార్, అభి, జయసింహారెడ్డి, రజకసంఘం నాయకులున్నారు.

ఆమనగల్లు : ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐలమ్మ విగ్రహానికి నాయకులతో కలిసి నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు నాగిళ్ల జగన్, పాతకోట నర్సింహ, మద్దూరి అయోధ్య, నాగిళ్ల లింగం, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర మరిచిపోలేనిదని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆమె విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. విగ్రహదాత కర్రోళ్ల చంద్రయ్య, నాయకులు నవీన్, అంబయ్య, కాకి ఈశ్వర్, రజకసంఘం నాయకులు యాదయ్య, కుమార్, శంకర్, శ్రీనివాస్, పాండు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని రజకాభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమరాజు వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటాలకు నివాళులర్పించారు. నాయకులు బి.మల్లేష్, ఆంజనేయులు, నరేష్, వెంకటేష్, కె.శ్రీశైలం, వెంకటయ్య, గోపాల్, మహేందర్, శ్రీశైలం, శీను, నాయకులు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : చాకలిఐలమ్మ ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని మాజీ కౌన్సిలర్, రజకసంఘం నాయకుడు ఆయిల్ కుమార్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆర్.గణేష్, రజక సంఘం నాయకులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ఐలమ్మ సేవలు మరువలేనివని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేషం అన్నారు. శంకర్‌పల్లిలో ఆమె విగ్రహానికి రజకసంఘం ఆధ్వర్యంలో పలువురు నివాళులర్పించారు. ప్రేమ్‌కుమార్, భానుప్రసాద్, రాములు, శ్రీనివాస్, శివ తదితరులు ఉన్నారు.

షాబాద్ : ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ తమ్మలి రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ రాజేందర్, సర్పంచ్‌లు వెంటయ్య, నాయకులు దండు రాహుల్‌గుప్తా, బీజేపీ మాజీ అధ్యక్షుడు లంబాడి కిరణ్, ఉపాధ్యక్షులు శేఖర్, నాయకులు రాము, హరికుమార్, శ్రీశైలం, తదితరులున్నారు.

మంచాల : ఐలమ్మ జయంతి వేడుకలను మండల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు మంచాలలోని ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కంబాలపల్లి భాస్కర్, పల్లాటి యాదయ్య, భిక్షపతి, ఏర్పుల శ్రీను, బాల్‌రాజ్, ఆకారం కృష్ణ, యాదయ్య, పి.శ్రీనివాస్, నరేష్, ముత్యాలు, వంశీ, గడ్డం గణేష్, అనిల్, భాష, జంగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


చేవెళ్ల : చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు


ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న రాము, నాయకులు


షాబాద్ : ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

నేడు మోత్యానాయక్ విగ్రహావిష్కరణ

కడ్తాల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గిరిజన నేత దేపావత్ మోత్యానాయక్ వర్ధంతి సందర్భంగా నేడు(శనివారం) విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మైసిగండి గ్రామంలోని మోత్యానాయక్ స్మృతివనంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి మోత్యానాయక్ కుమారుడు అనిల్ అందజేశారు. ఆదివారం సంస్మరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని నాయకులు, సంఘాల నేతలు, గిరిజన నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు అనిల్, విజయ్, మాజీ ఎంపీపీ కమ్లీలు కోరారు.


ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న దేపావత్ అనిల్

రోజంతా వాన!

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షం కురిసింది. శంకర్‌పల్లిలో 18 మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో ఫత్తేపూర్ వద్ద గల మూసీ నది ఉప్పొంగి ప్రవహించింది. అదే విధంగా ప్రొద్దటూరు బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలను నిలిపివేశారు. మోకిల పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. టంగటూరు, మోకిల గ్రామాల వద్ద వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఫత్తేపూర్ వద్ద మూసీ ప్రవాహాన్ని పరిశీలించారు. అలాగే శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, శంకర్‌పల్లి, మోకిల సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు. శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్‌లు మూసీ ప్రవాహాన్ని పరిశీలించారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మొయినాబాద్ మండలంలో ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల్లోకి వరద నీరు చేరుతోంది. చిలుకూరు పెద్ద చెరువు నిండడంతో ప్రధాన రహదారిపై నీరు పారుతోంది. కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్, శ్రీరంగాపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఇళ్లల్లోకి వాన నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కందుకూరు మండలం బాచుపల్లి గ్రామంలో కురిసిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన ఎర్ర జంగయ్య ఇల్లు గోడ పాక్షికంగా కూలింది. తాజా మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఇంటిని పరిశీలించి జంగయ్యకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని ఎంపీడీవో సరితకు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులకు నివేదికలు పంపిస్తానని ఆమె హామీ ఇచ్చారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతేరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కాలనీలలో వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పత్తి, వరి పంటపొలాలోకి వరద నీరు చేరింది. చెరువులు ,వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజలు ఇళ్లకే పరితమయ్యారు. మండలంలోని గుర్రంపల్లి, ఎదిర, రావిర్యాల గ్రామాల్లోని చెరువుల్లోకి భారీగా వర్షపు నీరు రాడంతో అలుగులు పారుతున్నాయి. కాగా, సొంత ఊరు రావడానికి భార్య వద్దకు బైక్‌పై వెళ్లిన భర్త ఆచూకీ తెలియరాలేదు. కొందుర్గు మండలం వెంకిర్యాలకు చెందిన లింగమయ్య(42) తన భార్య మండల పరిధిలోని తంగెళ్ళపల్లిలో వేచి ఉండటంతో తీసుకరావడానికి బైక్‌పై బయలుదేరాడు. అయితే, విశ్వనాథ్‌పూర్ వాగు వద్ద లింగమయ్య బైక్ నిలిపి ఉండగా ఆయన జాడ మాత్రం తెలియరాలేదని గ్రామస్తులు తెలిపారు. ఆందోళనకు గురైన బంధువులు ఆయన కోసం గాలిస్తున్నారు.


షాబాద్‌లో వర్షానికి కూలిన వెంకటయ్య ఇల్లు


కొందుర్గు : శ్రీరంగాపూర్‌లో ఇంట్లోకి వచ్చిన వర్షపు నీరు


చౌదరిగూడ : వనంపల్లిలో పత్తి పంట మధ్యలోంచి పారుతున్న వర్షపు నీరు

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందిస్తున్న పాలాది శ్రీనివాసులు

కేశంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా, మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలానికి చెందిన బీజేపీ నాయకుడు పాలాది శ్రీనివాసులు శుక్రవారం పంచాయతీ కార్మికులకు దుస్తులు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కొరకు తమ ప్రాణాలను పణంగా పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. అలాగే దేశాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పారిశుధ్య కార్మికుల అభ్యున్నతి, వారి శ్రేయస్సు కోసం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పథకాలు

కడ్తాల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పథకాలు రూపొందించి అమలు చేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, లక్పతినాయక్, క్యామ రాజేశ్, షాబొద్దీన్, తదితరులున్నారు.


చెక్కులు అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

యువతకు నైపుణ్య శిక్షణ

- టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువత నైపుణ్యంతో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. అభిరుచులకు అనుగుణంగా యువతీ యువకులకు టాస్క్ ద్వారా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శుక్రవారం సుంకిరెడ్డి పర్యటించారు. ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య శిక్షణ ఇస్తుందన్నారు. టాస్క్ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులున్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

క్రైం కార్నర్

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

ఆదిభట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తల్లితో గొడవపడిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై నోయెల్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపల్ మన్నెగూడకు చెందిన శ్యామల ప్రగతి(19) బీఎన్‌రెడ్డి నగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఈక్రమంలో వ్యక్తిగత సమస్యలతో కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటోంది. దాంతో రెండు రోజులుగా తన తల్లితో గొడవపడింది. శుక్రవారం ఇంట్లోని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాలనీ వాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈమేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రగతి(ఫైల్)

కడ్తాల్ మండలం సాలార్‌పూర్‌లో వివాహిత..

కడ్తాల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన శిరీష(20) ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. సాలార్‌పూర్‌కు చెందిన శిరీషకు అదే గ్రామానికి చెందిన వడ్త్యావత్ రాకేశ్‌తో ఐదు నెలలక్రితం వివాహమైంది. ఈక్రమం లో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో శిరీష చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే, ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. శిరీష తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.


శిరీష(ఫైల్)

రూ.4 లక్షలు అపహరణ.. ముగ్గురి రిమాండ్

- పనిచేసే చోటనే దొంగతనం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తాము పని చేస్తున్న కంపెనీకే కన్నం వేసి డబ్బులు అపహరించిన దొంగలను గురువారం అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఎన్‌టీఎక్స్ గ్రాసరీస్ పరిశ్రమలో మేనేజర్‌గా పనిచేసే ప్రవీణ్ ఈనెల 17న రెండురోజుల పాటు కలెక్ట్ చేసిన రూ.4లక్షలను పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో ఉన్న ఆఫీస్ లాకర్‌లో పెట్టి తాళం వేసి ఇంటికెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూడగా షట్టర్ తాళం విరుగ్గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా లాకర్‌లో డబ్బులు కనిపించలేదు. దాంతో అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని సాంకేతిక ఆధారాలతో విచారణ చేయగా గోడౌన్‌లో సరుకులు డెలివరీ చేసే నందిగామ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన శ్రీకాంత్(32), ఫరూఖ్‌నగర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన మధు(28)లు మరో వ్యక్తి మాలిక్(41) సాయంతో 17న రాత్రి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఈనెల 25న వారిని అరెస్టు చేసి విచారించగా నేరం చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు చెప్పారు. వారి నుంచి స్విఫ్ట్ కారు, 3 సెల్‌ఫోన్లు, రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

- తప్పిన పెను ప్రమాదం.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- మూడు గంటల పాటు ట్రాఫిక్‌జామ్.. క్లియర్ చేసిన పోలీసులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ట్యాంకర్ లారీని బస్సు ఢీకొన్న సంఘటన శుక్రవారం గండిగూడ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ గండిగూడ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కర్ణాటక నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు(కేఏ57 ఎఫ్1620) వేగంగా వచ్చి ఢీకొంది. దాంతో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. రెండూ పెద్ద వాహనాలు కావడంతో ఇరువైపులా దాదాపు 5 కిలోమీటర్లు మేర ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసులు వచ్చి దాదాపు మూడు గంటలు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా, ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. క్షతగాత్రులకు చికిత్స చేయించినట్లు సీఐ తెలిపారు. అయితే, సకాలంలో ట్రాఫిక్ పోలీసులు స్పందించలేదని వాహనదారులు వాపోయారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు


శంకర్‌పల్లి : వేడుకలో ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి


ఇబ్రహీంపట్నం : బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఐద్వా సభ్యులు

ఇబ్రహీంపట్నం /శంకర్‌పల్లి/ ఆమనగల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఐద్వా, సీఐటీయూల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుమలత, విజయమ్మ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కవిత, అరుణ, స్వప్న, ఉమ, సంతోష తదితరులు పాల్గొన్నారు. అలాగే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని ఆడిటోరియంలో మెప్మా, ఆర్పీలు, సిబ్బందితో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాధవరావు ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. బతుకమ్మలను సురసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. అధ్యాపకులు జైపాల్, పర్వతాలు, నాగమణి, తదితరులున్నారు

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

కొత్తూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కొత్తూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య అన్నారు. షాద్‌నగర్ రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తూ, కొత్తూర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన నర్సయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.


బాధ్యతలు చేపడుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సయ్య

అత్యుత్తమ ప్రమాణాలతో విద్యాబోధన

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యాచారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు కల్పిస్తూ అత్యుత్తమ అధ్యాపకులతో బోధన కొనసాగిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.